

సత్యవాక్కు
THE
WORD OF
TRUTH
క్రైస్తవ తెలుగు మాసపత్రిక
OCTOBER - 2002

# సంక్షిప్త వార్తలు

2002 సెప్టెంబరు 5వ తేదీ గురువారం పెద్దాపురం మండలం గోరింటలో రోజంతా జరిగిన బైబిలు క్లాసులో సోదరులు జాషువా గూటం గారు వాక్యోపదేశము చేసిరి. హైందవులలో నుండి క్రైస్తవులైన సోదరసోదరీలు అనేకులు హాజరై దేవుని గ్రంథములో లోతైన మర్మములను ఎన్నో గ్రహించుకొనగల్గిరి. గోరింట క్రీస్తు సంఘసభ్యులు వచ్చినవారందరినీ ఆప్యాయముగా పలుకరించిరి, సహవాస హస్తమునందించిరి. గోరింట, చదలాడ, పులిమేరు గ్రామములలో సోదరులు యువకులు యమ్. ప్రేమ్‌కుమార్ గారు దేవుని కొరకు మంచిపని చేయుచు అక్కడి స్థానిక సంఘాలను సత్యములో నడిపించుచున్నారు.

సెప్టెంబరు 8వతేదీ ఆదివారం రాజమండ్రికి సమీపముగా యున్న కొంతమూరు క్రీస్తుసంఘ ఆరాధన కార్యక్రమములో సోదరులు జాషువాగూటం గారు సతీసమేతముగా హాజరై వాక్యపరిచర్య చేసిరి. వాక్యమును బట్టి స్థానికసంఘమును ప్రోత్సహించిరి. కొంతమూరులో సోదరులు అబ్రహాంలింకన్ గారు స్థానిక సంఘ సువార్తికులుగా మంచి పనిచేయుచున్నారు. అక్కడి యువకులకు మంచి ప్రోత్సాహము నిచ్చుచున్నారు.

సెప్టెంబరు 12వ తేదీ గురువారం రాత్రి కొవ్వూరు మండలం అరికిరేవులలో బిల్‌పేక్షన్ చిల్డ్రన్ హోమ్‌లో వార్డెన్‌గా పనిచేయుచున్న సోదరులు జి. బాబ్జిగారు ఏర్పాటు చేసిన కృతజ్ఞత కూటములో సోదరులు జాషువాగూటం గారు సతీసమేతముగా హాజరై వాక్యపరిచర్య చేసిరి. మరియు చిల్డ్రన్ హోమ్ డైరక్టర్ ఎ. విశ్వేశ్వర రావు గారు, జాన్‌మోజెస్ గారు తదితర్లు దేవుని వాక్యమునుపదేశించిరి. బాబ్జీ దంపతులు వచ్చిన

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.O. Box-80, Kakinada, A.P. 533 001

Ph : 0884 - 363722

Editor :

**Joshua Gootam**

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 23 అక్టోబర్ 2002 సంచిక 3

# కుమారుని ఘనపరచుడి

*( Honour the Son )*

ఒకమారు యేసు ప్రభువు ఇట్లు చెప్పారు : "తండ్రిని ఘనపరునట్లుగా అందరును కుమారుని ఘనపరచవలెనని తీర్పుతీర్చుటకు సర్వాధికారము కుమారునికి అప్పగించియున్నాడు; కుమారుని ఘనపరచనివాడు ఆయనను పంపిన తండ్రిని ఘనపరచడు" (యోహాను 5:22,23). మానవ జీవితధ్యేయము ఒకే ఒక్కటి: "దేవునియందు భయభక్తులు కలిగియుండి ఆయన కట్టడల ననుసరించి నడుచుచుండ వలెను. మానవకోటికి ఇదియే విధి" (ప్రసంగి 12:13). అయితే దేవుని యొద్దకు వెళ్లుటకు, "నేనే మార్గమును, సత్యమును,

జీవమును; నాద్వారానే తప్ప ఎవడును తండ్రి యొద్దకు రాడని" యేసుప్రభువు చెప్పారు (యోహాను 14:6). మరియొక సందర్భములో, నేనును తండ్రియు ఏకమై యున్నాము; నన్ను చూచినవాడు తండ్రిని చూచి యున్నాడని ఆయన చెప్పారు (యోహాను 14:9; 10:30). మనము తండ్రియైన దేవుని ఘన పరచాలంటే, కుమారుడైన క్రీస్తును ఘనపరచాలి.

మేము క్రీస్తును ఘనపరచుచున్నామని అనేకులు చెప్పుకొంటారు గాని, నిజానికి వారు తమ పెదవులతో మాత్రమే ఆయనను ఘనపరుస్తారు; వారి హృదయం మాత్రమే ఆయనకు దూరముగా ఉంటాది. "ఈ ప్రజలు పెదవులతో నన్ను ఘనపరచుదురు గాని, వారి హృదయము నాకు దూరముగా ఉన్నది" అని యేసుప్రభువు చెప్పారు (మార్కు 7:6). మేము క్రీస్తును ఘనపరచుచున్నామని నోటిమాటలతో చెప్పేయడం సులభమే; గాని మాటల తోనే కాదు, క్రియలతోను ఆయనను ఘనపరచాలి. ఆయనను పూర్ణాత్మ తోను, పూర్ణమనస్సుతోను, పూర్ణ హృదయంతోను సేవించాలి. అట్లు చేసినప్పుడే కుమారుడైన క్రీస్తును ఘనపరచగలము.

## ఆయన చిత్తానికి లోబడాలి

మన జీవితాల్లో దేవుని అధికారాన్ని అన్ని వేళల గుర్తించుటలో మనము దేవుని ఘనపరచగలము. దేవుడు మానవుని తన స్వరూప మందు చేసారు గనుక మానవునిపై ఆయనకు సర్వాధికార మున్నది. "యెహోవాయే దేవుడని తెలిసికొనుడి. ఆయనే మనలను పుట్టించెను. మనము ఆయన వారము. మనము ఆయన ప్రజలము, ఆయన మేపు గొర్రెలము" అని భక్తుడైన దావీదు వ్రాసాడు (కీర్తన 100:3). మనలను దేవునివారముగా చేయడానికి క్రీస్తు ఈలోకానికి వచ్చారు. ఇహపరముల యందు సమస్తాధికారము ఇప్పుడాయన కలిగియున్నారు (మత్త 28:18). తండ్రియొక్క చిత్తాన్నే క్రీస్తు బయలుపరచారు. క్రీస్తు వాక్యాన్ని నెరవేర్చుట ద్వారా మనము తండ్రియైన దేవుని ఘనపరచగలము.

దేవుని యందును, క్రీస్తునందును విశ్వాసముంచుట ద్వారా మనము దేవుని ఘనపరచగలము. "విశ్వాసము లేకుండ దేవుని కిష్టుడై యుండుట అసాధ్యము" (హెబ్రీ 11:6). మీరు దేవుని యందు విశ్వాస ముంచుచున్నారు, నా యందును విశ్వాసముంచుడి యని యేసుప్రభువు చెప్పారు (యోహాను 14:1). దేవుడు తన కుమారుని మనకొరకు ఈ లోకానికి పంపారు: "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అను గ్రహించెను. లోకము తన కుమారుని ద్వారా రక్షణ పొందుటకే గాని లోకము నకు తీర్పుతీర్చుటకు దేవుడాయనను లోకములోనికి పంపలేదు" (యోహాను 3:16,17). "కుమారుని యందు విశ్వాసముంచువాడే నిత్యజీవము గలవాడు; కుమారునికి విధేయుడు కానివాడు జీవము చూడడు గాని దేవుని ఉగ్రత వానిమీద నిలిచియుండును" (యోహాను 3:36).

మీరు మారుమనస్సు పొందని యెడల నశింతురని యేసుప్రభువు చెప్పారు (లూకా 13:3). క్రీస్తునందలి విశ్వాసము ఒక నూతన జీవితము లోనికి మనలను నడిపిస్తాది. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన వారికి పౌలు ఇట్లు వ్రాసాడు: "కృప విస్తరించవలెనని పాపమందు నిలిచియుందుమా? అట్లనరాదు. పాపము విషయమై చనిపోయిన మనము ఇకమీదట దానిలో ఏలాగు జీవించుదుము?" (రోమా 6:1,2). "కాబట్టి శరీర దురాశలకు లోబడు నట్లుగా చావునకు లోనైన మీ శరీరమందు పాపమును ఏలనియ్యకుడి" (రోమా 6:12). క్రీస్తు నందు విశ్వాసముంచిన వాడు జీవించే విధానము వేరుగా యుంటాది, అతడు తన జీవితముతో దేవుని మహిమ పరుస్తాడు.

మరల, దేవుని చిత్తానికి లోబడుట ద్వారా మనము దేవుని, ఆయన కుమారుని ఘనపరచగలము. అనేకులు ఆయనను ప్రభువా, ప్రభువా

అని పిలుస్తారుగాని, ఆయన చిత్తానికి లోబడరు. "నేను చెప్పు మాటల ప్రకారము మీరు చేయక ప్రభువా, ప్రభువా అని నన్ను పిలుచుట ఎందుకు?" అని యేసుప్రభువు ఒకసారి ప్రశ్నించారు (లూకా 6:46). ఆయనే సర్వాధికారి యని మనము గుర్తించి, ఆయన యందు విశ్వాసముంచి నప్పుడు ఆయన యిచ్చే ఆజ్ఞలన్నిటికి లోబడ్తాము, యిది చాలా సూక్ష్మమైనది. నేనాయనను నమ్ముచున్నాను గాని బాప్తిస్మము పొందను, ఆయనను నమ్ముదును గాని నా పాత అలవాట్లను మార్చుకోను అని రకరకాల సాకులను కొందరు చెబుతారు. అట్టివారు ఆయన చిత్తానికి లోబడుచున్న వారు కారు, వారు అవిశ్వాసుల కంటే చెడ్డవారు. ప్రభువు చిత్తానికి లోబడనివాడు, ఆయనను ఘనపరచలేడు.

## బాప్తిస్మము పొందాలి

క్రీస్తులోనికి బాప్తిస్మము పొందుట ద్వారా నేడు మనము ఆయనను ఘనపరచగలము. యేసు తన శిష్యులకిట్లు చెప్పాడు: "మీరు సర్వ లోకమునకు వెళ్లి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మని వానికి శిక్ష విధించబడును" (మార్కు 16:15,16). మేము క్రీస్తునే ఘనపరచుచున్నామని చెప్పుకొను వారనేకులు ఆయన యిచ్చిన ఈ ఆజ్ఞను నెరవేర్చరు; దానిని యితరులకు బోధించరు. యిది చాలా ఆశ్చర్యం! నిజముగా క్రీస్తునందు విశ్వాసముంచిన వారు బాప్తిస్మమును గూర్చి ఏవిధమైన వాగ్వాదము పెట్టుకోరు. రక్షింప బడాలంటే బాప్తిస్మ మక్కరలేదనే దయ్యపు బోధ చేయరు. విశ్వాసియైన ప్రతివాడు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందాలి (అపొ.కా. 2:38). అది దేవుని ఆజ్ఞ, దానికి లోబడితే ప్రభువును ఘనపరచిన వారమవుతాము. క్రొత్తనిబంధన కాలములో ప్రజలు విశ్వసించి నప్పుడు వెంటనే బాప్తిస్మము పొందారు. వారు కనిపెట్టలేదు. ఈనాడు కూడ క్రీస్తులో రక్షింపబడగోరువాడు కనిపెట్టనవుసరంలేదు; వెంటనే బాప్తిస్మము పొందాలి.

# సంఘము ద్వారా సేవించాలి

క్రీస్తును ఆయన సంఘము ద్వారా సేవించుచు మనము ఆయనను ఘనపరచగలము. క్రీస్తు నా సంఘమును కట్టుదునని చెప్పారు (మత్త 16:18). ఆయన తన సంఘాన్ని కట్టారు; దాన్ని తన స్వరక్తమిచ్చి సంపాదించారు (అపొ.కా. 20:28). క్రీస్తుయేసు మూలముగా సంఘములో తరతరములు సదాకాలము దేవునికి మహిమ కలుగాలని దేవుని సంకల్పమై యున్నది (ఎఫెసీ 3:21).

మానవునలు స్థాపించిన మతశాఖలు, మతములు నేడు అనేకము లున్నాయి. వాటి ద్వారా దేవుని ఘనపరచలేము. సరిగదా ఆయన శిష్యులు భిన్నమైన శాఖలవలె చీలిపోవాలని ఆయన ఉద్దేశముకాదు. వారు లోకమంతా వ్యాపించినను ఒకే శరీరముగా, క్రీస్తు శరీరముగా అంటే క్రీస్తు సంఘముగా యుండి ఆయనను సేవించాలని ఆయన సంకల్పమైయున్నది. మానవ కల్పిత శాఖలను వీడి క్రీస్తు స్థాపించిన సంఘములో యుండి ఆయనకు సేవ చేయుటకంటే గొప్ప ఘనత ఇంకొకటి లేదు.

నీవు క్రీస్తు సంఘ సభ్యుడవు కాగోరుచున్న యెడల, యేసుప్రభువు నందు విశ్వాసముంచి, నీ పాపముల విషయమై మారుమనస్సు బొంది, పాపక్షమాపణ నిమిత్తము నీటిలో ముంచడము బొందుము. ప్రభువు నిన్ను రక్షించి తన సంఘముతో చేర్చుకొంటారు, ఆ ఘడియనుండి నీ జీవితంలో ప్రభువును ఘనపరచుటకు ఆరంభించగలవు.

# నీ చేతిలోనిది ఏమిటి ? (నిర్గమ 4:2)

## ("What is that in Thine Hand ?")

### ఈ ప్రశ్న వేసింది దేవుడే

అల్పుడైన మానవుని ద్వారా దేవుడు గొప్ప పనులు చేయగలరని మోషే గ్రహించుకొనునట్లు దేవుడు ఈ ప్రశ్నను మోషేనడిగారు. దేవుని ప్రజలైన ఇశ్రాయేలీయులు ఐగుప్తులో బానిసలుగా యుండి అణగద్రొక్క బడుచుండిరి. వారు విమోచింపబడాలని, మోషే వారికి విమోచన కర్త కావాలని దేవుని యొక్క చిత్తమై యుండెను (నిర్గమ 3:9,10). అంతగొప్ప పనిని సాధించుటకు తాను తగినవాడను కానని తలంచి మోషే దేవునితో, "చిత్తగించుము; వారు నన్ను నమ్మరు, నామాట వినరు - యెహోవా నీకు ప్రత్యక్షముకాలేదందురు" అని ఉత్తరమిచ్చాడు (నిర్గము 4:1). యెహోవా, "నీ చేతిలోనిది ఏమిటి?" అని అప్పుడతని ప్రశ్నించారు.

అందుకతడు ఒక కర్రయని జవాబిచ్చాడు. అది గొర్రెల మందలను కాయుటకుపయోగించు ఒక కర్ర అయి యుండవచ్చును. గాని మోషే చేతిలో నిర్జీవమై యున్న ఆ కర్రను దేవుడు సజీవమైన ఒక పాముగా మార్చారు. మరల, పామును కర్రగా మార్చారు. "దానిచేత వారు తమ పితరుల దేవుడైన యెహోవా ... నీకు ప్రత్యక్షమాయెనని నమ్ముదురని" ఆయన మోషేతో చెప్పెను (నిర్గ 4:5). అట్టి సర్వశక్తిమంతుడైన దేవుడు మోషే ద్వారా ఐగుప్తీయుల యెడల తన చిత్తాన్ని నెరవేర్చగల సామర్థ్యుడు. ఆయన మన ద్వారా తన క్రియలను చేయగల సామర్థ్యుడు. గాని మనం అనేకసార్లు ఆయనను నిరాకరించు చున్నాము. పౌలువంటి విశ్వాసము గల క్రైస్తవుడు గొప్ప శక్తిగలవాడు. "నన్ను బలపరచువాని యందే నేను

సమస్తమును చేయగలను" అని అపొ.పౌలు చెప్పాడు (ఫిలిప్పీ 4:13). క్రీస్తు మనకు శక్తిననుగ్రహిస్తారు. దానిని మనం శంకించరాదు.

## దేవుని శక్తితో నింపబడిన ఆ కర్ర ద్వారా మోషే అనేక సూచక క్రియలు చేయుటకు వీలు పడెను (నిర్గ 4:17)

మోషే దేవుని యొక్క ప్రతినిధియని నిర్ధారణ యగుటకు అది సహాయపడెను. యిది అత్యవసరము, ఏలయనగా అనేకమంది అబద్ధ ప్రవక్తలు లోకములోనికి బయలు వెళ్లిరి (2 పేతు 2:1-3). క్రీస్తు కూడా ఆయన కాలమందు అట్టివారిని గూర్చి హెచ్చరిక చేసెను (మత్త 7:15).

దేవుడు తన సేవకులను ఎప్పుడు నిర్ధారణ లేకుండా పంపలేదు. సేవకుడు దేవుని నుండి వచ్చినవాడనే నిర్ధారణ లేకుండా ఆయన ఎవని ఎన్నడు పంపియుండలేదు. నిస్సందేహమైన నిర్ధారణ అవుసరం. మోషే చేతిలో కర్రయుండెను! అపొస్తలుల చేతిలో అద్భుతములు చేసే శక్తియుండెను (అపొ.కా. 1:4,5; 2:1-4). తదుపరి వారు అద్భుతములు చేసి తాము ప్రకటించిన సువార్తను స్థిరపరచిరి (మార్కు 16:20; హెబ్రీ 2:3,14). ఈ రోజైతే మనం చెప్పునది యదార్థమని నిరూపించుటకు లేఖనములున్నవి. అవే దేవుని వాక్యం (2 తిమో 3:16-17).

మన చేతిలోని స్వల్ప వస్తువులను గొప్ప ఆయుధములుగా చేయగల శక్తి దేవునికున్నది ! కొరగాని కర్ర విషయంలో యిది నిజం ! అట్టి ఉదాహరణలు అనేకము లున్నాయి.

1. షమ్గరూ, నీ చేతిలోని దేమిటి? ఒక మునుకోల కర్ర :- గాని దానిని దేవుని పనివిషయమై వినియోగించగా అతడు ఫిలిష్తీయులలో ఆరువందల మందిని ఆ మునుకోల కర్రతో హతము చేసెను. అతడును ఇశ్రాయేలీయులను రక్షించెను (న్యాయాధి 3:30).

2. దావీదూ, నీ చేతిలోనిది యేమిటి? ఒక వడిసెల :- గాని దేవుని సేవకొరకు దాన్ని అర్పించగా, అది గొప్ప ప్రఖ్యాతిగాంచిన అయుధమయ్యెను! దావీదు ఫిలిష్తీయుల బలాఢ్యుని చంపుటకు ఆ వడిసెలను వినియోగించెను. దేవుని సైన్యమును రక్షించెను ( 1 సమూ 17).

3. యాకోబూ, నీ చేతిలోనిది యేమిటి? :- బావులను త్రవ్వే పరికరాలు! వాటి ద్వారా యాకోబు ఒక బావిని త్రవ్వించెను. గాని అనేక వందల సం॥ల తరువాత యేసు ప్రభువే స్వయాన ఆ బావి యొద్ద అలసట తీర్చుకొనుటకు వచ్చెను. ఒకానొక దినమందు ప్రభువే ఆ బావి నీళ్లు త్రాగునని యాకోబు ఎన్నడు తలంచలేదు! మన సత్క్రియలను బట్టి ఎవరు మేలు పొందుదురో మనకు తెలియదు. అవి నిరంతరం ఫలిస్తూనే యుంటాయి.

4. చిన్నవాడా, నీ చేతిలోనిది యేమిటి? :- అతని మధ్యాహ్న భోజనపుమూట. అందులో 5 రొట్టెలు, రెండు చిన్న చేపలున్నాయి. గాని వాటిని ప్రభువుకు సమర్పించినప్పుడు 5 వేలమంది కంటే ఎక్కువ మందికి ఆహారమయ్యాయి! (యోహాను 6:9-13).

5. ఒక బీద విధవరాలు :- అమ్మా నీ చేతిలోనిదేమిటి? రెండు కాసులు మాత్రమే! గాని అక్కడ కానుకలపెట్టెలో వేసిన వారందరికంటే ఆమె ఎక్కువ యిచ్చెనని ప్రభువు గమనించారు. ఆమె తనకు కలిగినదంతా ఇచ్చేసింది!! (మార్కు 12:41-44). ఆమె చేయగలిగినదంతా చేసింది. అంతకంటే ఎక్కువ ఎవరు చేయలేరు. ఆమె చేసిందే ఒక గంభీర ప్రసంగ పాఠం !

మన చేతిలోని చిన్న సంగతులను దేవునికి సమర్పణ చేసిన యెడల దేవుడు వాటిని గొప్పగా చేయగలడు. మన చేతిలోనిది విలువైనదో,

గొప్పదోయని కాదుగాని, దాన్ని మనం దేవుని మహిమకు వినియోగించుటకు ఇష్టపడుచున్నామో లేదోయని దేవుడు గమనించును (లూకా 16:10 చదువుము).

## మిత్రుడా, నీ చేతిలోనిది యేమిటి?

1) *నీ జీవితం :* దాన్ని నీవే జీవించగలవు. నీవే దానికి బాధ్యుడవు, లెక్క అప్పగించువాడవు (రోమా 14:12; 2:6). మన భావి జీవితం మన ప్రస్తుత జీవితంపై ఆధారపడును. మనమేమి విత్తుదుమో, దానినే కోయుదుము (గలతీ 6:7).

2) *నీ సమయం :* మన కీయబడిన అతి విలువైన, ప్రశస్తమైన బహుమానం సమయం. దానిని కొనలేము. ఎంత డబ్బు వెచ్చించినను ఒక్క గంట సమయాన్ని కొనలేము. సమయాన్ని దుర్వినియోగం చేస్తే, జీవితమే దుర్వినియోగం అవుతాది. మానవుడు సమయాన్ని వినియోగించే విధానాన్ని బట్టి సమయం అతని గొప్ప మిత్రుడు గాని శత్రువు గాని కావచ్చును. అందువలన దేవా "మాకు జ్ఞాన హృదయము కలుగునట్లుగా చేయుము. మా దినములు లెక్కించుటకు మాకు నేర్పుము" (కీర్తన 90:12) అని ప్రార్థించాలి.

3) *నీ పలుకుబడి :* నీ పలుకుబడి మంచిదైనను, చెడ్డదైనను అది నీ చేతిలో యున్నదే, అది నీకు మేలుగాని కీడు గాని చేయును (1 పేతురు 3:1,2; గలతీ 5:7-9). మనం మృతిజెందిన తరువాత కూడా మన ప్రభావము నిలిచేయుంటాది (ప్రక 14:13).

4) *నీ తలాంతులు :* మన తలాంతులను మనం వినియోగించిన యెడల అవి అభివృద్ధి జెందును. వాటిని నిర్లక్ష్యం చేస్తే, అవి మన యొద్దనుండి తీసివేయబడును (మత్తయి 25:24-30). దేవుడు

ప్రతివానికిచ్చిన తలాంతులను బట్టి వానివానికి తీర్పుతీర్చును. "మనుష్యులు ఎవనికి ఎక్కువగా అప్పగింతురో వాని యొద్ద ఎక్కువగా అడుగుదురు" (లూకా 12:48).

*5)* *నీ ఆత్మ :* నీ ఆత్మ రక్షణ నీ చేతిలోనే యున్నది. "మీరు మూర్ఖులగు ఈ తరమువారికి వేరై రక్షణ పొందుడని" పేతురు పెంతెకొస్తు నాటి ప్రజలను హెచ్చరించెను (అపొ.కా. 2:40). నీ ఆత్మ అతి ప్రశస్తమైనది. దాన్ని రక్షించుకో (మార్కు 8:36-37). నీ జీవిత గమ్యం నీ చేతిలోనే యున్నది !

-- లీరోయ్ బ్రౌన్లో.

# సత్యసంఘమును గుర్తించుట

## *( Identifying The True Church )*

ప్రపంచమందు నేడు అనేక మతశాఖలున్నాయి. అవి విభిన్న నామములు ధరించి, పరస్పర విరుద్ధ బోధలను కలిగియుండి కూడ దేవుని మార్గాన్నే అనుసరించు చున్నట్లు ప్రకటించుచున్నవి. ఈ బోధలన్నియు యధార్థమైనవైతే దేవుడు ఈ కలవరానికి కర్తయైయున్నాడా ?

సత్యసంఘాన్ని నీవెట్లు కనుగొనగలవు? మానవుల మనోభావాలు

గాని, కల్పిత బోధలుగాని, పారంపర్యాచారములు గాని అధికారయుక్తమైన దేవుని చిత్తము కాజాలవు. దైవావేశపూరితమైన, సంపూర్ణమైన యదార్థమైన దేవుని చిత్తమును బైబిలు మనకు తెలియజేయుచున్నది (2 తిమోతి 3:16; 2 పేతు 1:3; యూదా 3). దేవుని సంఘమును గూర్చి మనం తెలిసికోవాలంటే లేఖనాలే ఆధారం.

## ఒక పథకం ప్రకారం సంఘము నిర్మింపబడినది

ఏదైనా ఒకటి నిర్మించుటకు దేవుడు ఒక ప్రణాళికను సిద్దపరచెను. నోవహు ఓడ నిర్మించే పథకాన్ని దేవుడనుగ్రహించెను (ఆది 6:14-16). దేవుని సంతోషపరచుట కొరకు ఆయన పథకాన్ని నోవహు జాగ్రత్తగా అనుసరించెను (ఆది 6:22). ప్రత్యక్షపు గుడారము యొక్క నమూనాను మోషేకు దేవుడు తెలియజేయగా, అతడు దేవుని పథకమును శ్రద్ధగా అనుసరించెను (నిర్గమ 25:9,40; 39:32). ఆ తరువాత దేవుని మందిర నిర్మాణమును గూర్చి దేవుడు తెలియజేసిన పథకమును దావీదు అతని కుమారుడైన సొలొమోనును అనుసరించెను (1 దిన 28:11-21).

క్రొత్తనిబంధన దేవుని సంఘము యొక్క స్వరూపమును గూర్చి తెలియజేయుచున్నదను సత్యమును గూర్చి ఆశ్చర్యపడవలసిన పనిలేదు (రోమా 6:17; 2 తిమో 1:13; హెబ్రీ 8:1-5). సత్యసంఘమును నీవు కనుగొనవలెనంటే నూతన నిబంధన యొద్దకు వెళ్లాలి. క్రొత్తనిబంధన తెలియజేసిన నమూనాను అనుసరించి సంఘము నిర్మింపబడితే అదే సత్యమైన సంఘమౌతుంది. దేవుని వాక్యము ననుసరించి గాక, వేరే మార్గంలో నిర్మించబడిన సంఘము సత్యసంఘము కానేరదు.

## క్రీస్తు ఆయన సంఘము

క్రొత్తనిబంధన ప్రకారము యేసుక్రీస్తే సంఘస్థాపకుడు, పునాది మరియు శిరస్సు. సీమోను పేతురు “నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన

క్రీస్తువు" అని ఒప్పుకొనిన వెంటనే "నీవు పేతురువు ఈ బండమీద నా సంఘమును కట్టుదును" అని క్రీస్తు సెలవిచ్చెను (మత్త 16:13-20). ఈ బండ పేతురు కాదు. సంఘము ఎట్టి పునాదిపై నిర్మింపబడినదో బైబిలు స్పష్టముగా తెలియజేయుచున్నది. "వేయబడినది తప్ప, మరియొక పునాది ఎవడును వేయనేరడు. ఈ పునాది యేసుక్రీస్తే" (1 కొరింథీ 3:11).

తన సంఘమును స్థాపించుదునని క్రీస్తు ముందుగానే వాగ్దానము చేసెను. ఆయన భూమిమీద తన పనిని నెరవేర్చి, తండ్రియొద్దకు వెళ్లి సర్వసత్యములోనికి వారిని నడిపించునట్లు అపొస్తలుల యొద్దకు ఆదరణ కర్తను పంపెను (యోహా 16:13; అపొ.కా. 2:1). పునరుత్థానము తరువాత పెంతెకోస్తు పండుగ దినమున అపొస్తలులు పరిశుద్ధాత్మావేశము వలన సంపూర్ణమైన క్రీస్తు సువార్తను ప్రజలకు ప్రకటించిరి. అక్కడ వినుచున్న పాపులు "సహోదరులా మేమేమి చేతుమని" అడిగిరి. వారు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందవలెనని హెచ్చరింప బడిరి (అపొ.కా. 2:36-38). మూడువేల ఆత్మలు సువార్త ఆజ్ఞలకు విధేయులై సంఘముతో చేర్చబడిరి (అపొ.కా. 2:41-47). ఇదియే క్రీస్తు సంఘము యొక్క ఆరంభము.

క్రీస్తే ఆయన సంఘమునకు శిరస్సు. క్రీస్తు ఆరోహణమునకు ముందు ఆయన ఈలాగు సెలవిచ్చెను. "పరలోకమందును, భూమిమీదను నాకు సర్వాధికారము ఇయ్యబడియున్నది" (మత్త 28:18). భూసంబంధమైన శిరస్సును గూర్చి ఎచ్చటను ప్రస్తావించబడలేదు. క్రొత్తనిబంధనలో "క్రీస్తు సంఘములు" అని వ్రాయబడింది. సంఘసభ్యులు క్రైస్తవులని పిలువబడిరి (అపొ.కా. 4:12; 11:26; 1 పేతు 4:16).

## క్రీస్తు సంఘ పరిపాలన

క్రీస్తే శిరస్సుగా, స్వయం పరిపాలన కలిగిన, క్రీస్తు శరీరమైన ఆయన సంఘం అనేక ప్రాంతాలలో కూడుకొనుచున్నది (రోమా 16:16; 1 కొరింథీ

1:2). ప్రతి స్థానిక సంఘము పెద్దలచే నడిపింపబడుచున్నది. వీరిని కాపరులని, అధ్యక్షులని, మీ పైని నాయకులని క్రొత్తనిబంధన పిలుచుచున్నది. ఈ పేర్లన్నియు ఒకే పనిని నిర్వహించు పెద్దలకు పర్యాయ పదములుగ ఇవ్వబడినవి (అపొ.కా. 20:17,28; తీతు 1:5-9; 1 పేతు 5:1-4). వీరు ఒకరికంటె ఎక్కువగా ఉండి సంఘముపై అధికారులుగ నియమింపబడాలి (అపొ.కా. 14:23). సంఘములపై అధికారాన్ని కలిగియుండే గుంపులు (Councils), సంఘవిధులను శాసించే అధికారుల సమూహములు (Synods), సదస్సులను (Conferences) గూర్చి క్రొత్తనిబంధన ఎక్కడ ప్రస్తావించలేదు.

పరిచారకులు పెద్దల పర్యవేక్షణలో పనిచేయాలి (ఫిలిప్పీ 1:1). పెద్దలు, పరిచారకులు వారి అర్హతలను బట్టి సంఘములో నియమింపబడాలి (1తిమోతి 3; తీతు 1). సువార్తికుడు సువార్త ప్రకటించుచు పెద్దల పర్యవేక్షణలో పనిచేయాలి (2 తిమో 4:1-5).

## సంఘ ఆరాధన

దేవుడు ఇశ్రాయేలీయులకు పాతనిబంధనలో ఒక ఆరాధన క్రమమును ఏవిధముగా ఇచ్చెనో, అలాగే ఆయన సంఘమునకు ఒక ఆరాధన క్రమమును ఇచ్చెను (యోహా 4:23-24). మతశాఖలు అనుసరించునట్లు సుదీర్ఘమైన పూజాక్రమమువలె గాక, ఆయన తన సంఘమునకిచ్చిన ఆరాధన క్రమము చాలా సామాన్యమైనది, ఆత్మీయమైనది. ఇది భౌతిక సంబంధమైన ఆరాధన కాదు.

క్రొత్తనిబంధన ఆరాధన యందు అయిదు అంశాలున్నాయి. మొదటిది పాటలు, కీర్తనలు, ఆత్మసంబంధమైన పద్యములు పాడవలెనని హెచ్చరింపబడెను (ఎఫె 5:19; కొలస్స 3:16). క్రొత్తనిబంధన ఆరాధన యందు యాంత్రిక సంగీతము లేదు. సంఘము ప్రారంభమైన శతాబ్దాల అనంతరము కేథలిక్కులు వాయిద్యములను ప్రవేశపెట్టిరి (2 యోహా 9,11; ప్రక 22:18-19).

తరువాత వాయిద్యాలతో పాటులు పాడే గుంపులు బయలుదేరినవి. ప్రతి క్రైస్తవుడు ఒకరి స్వరము మరొకరితో కలిపి దేవునికి పాటలు పాడుచు స్తుతులు చెల్లించాలి.

రెండవది క్రీస్తు అను మధ్యవర్తి ద్వారా తండ్రికి చేయు ప్రార్థన (అపొ.కా. 2:42; 1 తిమో 2:1-8). మూడవది దేవుని వాక్యము ప్రకటించుట ఆయన ఆరాధనలో ఒక అంశము (మత్త 28:19-20; అపొ.కా. 2:42, 20:7). నాలుగవది మన పాపక్షమాపణ నిమిత్తము క్రీస్తు శరీరము గాయపర్చబడి, తన రక్తమును చిందించిన బలియాగమునకు జ్ఞాపకముగ ప్రతి ఆదివారము సంఘములో క్రైస్తవులు పులియని రొట్టెను, ద్రాక్షారసమును తీసుకొన వలసియున్నది. ఐదవది వర్ధిల్లిన కొలది ఇచ్చుట ద్వారా క్రైస్తవులు ఆరాధించవలెను (1 కొరింథీ 16:2; 2 కొరి 9:7). సంఘము యొక్క నిధులు సమకూర్చబడునట్లు వారమునకు ఒక్కసారే హృదయపూర్వకముగ ఇచ్చినది తప్ప వేరే పద్ధతి క్రొత్తనిబంధన యందు కనపడదు.

## సంఘము యొక్క పని

అనేక ఆధునిక సంఘాలు సంక్షేమ సంస్థలుగ కనపడుచున్నవి. అవి ఆత్మసంబంధమైనవిగ నుండక రాజకీయముగను, మానసిక వికాస కేంద్రాలుగను, స్వచ్ఛంద సేవాసంస్థలుగను ఉన్నాయి. సత్యసంఘము క్రొత్త నిబంధనలో దేవుడిచ్చిన కట్టడలను అనుసరింపవలసి యున్నది. క్రీస్తు సువార్తను ప్రకటించుటయే సంఘము యొక్క ముఖ్యమైన పని (మత్త 28:19-20; రోమా 10:13-15; 2 తిమో 2:2).

ఏ సంఘమైతే సువార్త ప్రకటించు పనికి ప్రాముఖ్యము నిచ్చు స్వభావము, ఆసక్తి కలిగి లేదో అది సత్యసంఘము కానేరదు !

అవసరాలలో ఉన్నవారికి సహాయమందించుట కూడ సంఘము యొక్క పనియే. విధవరాండ్రను, అనాధలను, అవసరాలలో ఉన్నవారిని

ఆదుకొనుట ద్వారా సంఘము దేవుని నియమమునకు లోబడినదై యుండును (యాకో 1:27). సంఘము, వ్యక్తిగత క్రైస్తవులు దాతృత్వము కలిగినవారుగ ఉండాలి (మత్త 25:31-36). సంఘము అవసరాలలో ఉన్నవారిని ఆదుకొనే స్వభావం కలిగి యుండాలి (గలతి 1:2, 6:10).

## ప్రవేశము కొరకు ఇవ్వబడిన ఆజ్ఞలు

సంఘము క్రీస్తు రక్తముచేత కొనబడెను (అపొ.కా. 20:28). క్రీస్తు సంఘములో నుండుట అంటే క్రీస్తునందుండుటయే (ఎఫె 1:7; గలతి 3:27). గనుక క్రీస్తు సంఘమందు సభ్యత్వము అత్యవసరము. అయితే క్రీస్తు సంఘములో ఒకడు సభ్యుడెట్లుకాగలడు? లేదా రక్షణ పొందుటకు ఒకడు ఏమి చేయవలెను ?

దేవుని వాక్యము రాజ్యము యొక్క విత్తనము (లూకా 8:11). ఈ విత్తనము మనుష్యుల హృదయాలలో విత్తబడాలి (యాకో 1:18,21; 1 పేతు 1:22-23). మంచితనము, నిజాయితీ గల హృదయాలలో ఈ విత్తనము క్రీస్తునందు ఫలించు విశ్వాసమును కలిగించును (లూకా 8:15; రోమా 10:17; యోహా 8:24). నిజమైన విశ్వాసము ఒకనిని విధేయుడగుటకు ప్రోత్సహించును (యాకో 2:20-26; హెబ్రీ 5:8-9). విశ్వాసము ఒకని గత పాపములనుండి మారుమనస్సు పొందుటకు ప్రోత్సహించును (అపొ.కా. 2:38, 17:30-31). మారుమనస్సు అనగా హృదయములు మార్చబడుట. ఇది దైవచిత్తానుసారమైన దుఃఖము ద్వారా హృదయము మార్చబడునట్లు ఒకనిని ప్రోత్సహించును (మత్త 21:28; 2 కొరి 7:10; మత్త 3:8). నిజమైన విశ్వాసము ఒకనిని యేసే క్రీస్తేనియు, ఆయన జీవము గల దేవుని కుమారుడనియు ఒప్పుకొనునట్లు ప్రోత్సహించును (అ.కా. 8:37; రోమా 10:8-10).

క్రీస్తులోనికి బాప్తిస్మము పొందకుండ ఒకని విశ్వాసము సంపూర్ణము కానేరదు (రోమా 6:35; కొలస్స 2:12). బాప్తిస్మము రక్షించును (మార్కు 16:16; 1 పేతు 3:21). బాప్తిస్మము పాపములను కడిగివేయును (అ.కా. 22:16). బాప్తిస్మము పాపక్షమాపణ నిమిత్తము (అ.కా. 2:38). బాప్తిస్మము ఒకని క్రీస్తునందుంచును (గలతి 3:27). బాప్తిస్మము ఒకని క్రీస్తు శరీరమైన సంఘమునందుంచును (1 కొరి 12:13; 1 కొలస్స 1:18). బాప్తిస్మము పొందని క్రైస్తవుడు ఉన్నట్లు దేవుని వాక్యమందు ఎచ్చటను కనపడదు.

## నీవు ఎక్కడ ఉన్నావు !

చదువరీ, నీవు ఎక్కడ ఉన్నావు? నీవు సభ్యుడవుగా నున్న సంఘము క్రొత్తనిబంధన తెలియజేసిన సంఘమేనా ? క్రొత్తనిబంధన నియమమును బట్టి కట్టబడి, క్రొత్తనిబంధన ఆజ్ఞలను ఆ సంఘము పాటించుచున్నదా ? ఒకవేళ అందు ఏది కొదువగా ఉన్నను అది సత్యసంఘము కాదు.

ఒకవేళ నీవు సత్యసంఘమును వెదకుచున్నావేమో? దీనికి బదులుగా ఉన్నదానికి (Substitute) నీవు అంగీకరింపవద్దు. అది ఒక అవకాశమని నీవు భావించకు. బైబిలు మాత్రమే నీకు మార్గదర్శి. దేవుని వాక్యమును అనుసరించేవారు సత్యమార్గమందు ఉన్నవారే. వక్రమార్గానికి వాక్యము చోటివ్వదు. దైవికమైన మార్గము ద్వారా నేడే నిజమైన క్రీస్తు సత్య సంఘమందు సభ్యుడవుకమ్ము.

మమ్ము సంప్రదించిన యెడల, మేము సత్యము గూర్చి మరియు రక్షణ కొరకైన నీ కోరిక నెరవేర్చబడినట్లు వాక్యముతో మీకు సహకరించెదము.

-- రాడ్ రూథర్‌ఫర్డ్.

# మారుమనస్సు

## ( Repentance )

పరలోకములో దేవుడు ఎంత నిశ్చయముగా యున్నాడో అంత నిశ్చయముగా ఈ అంశము మనందరికి అవుసరమై యున్నది. ఏలయనగా అది సార్వజనికమైన ఆజ్ఞయై యున్నది. మానవుడు ఎంత నిశ్చయముగా పాపము చేసెనో అంతే నిశ్చయముగా దేవుని క్షమాపణ అతడు పొంద వలెను. మారుమనస్సు అనగా ఏమిటి? మారుమనస్సు అనగా మనస్సును మార్చుకొనుట. గతములో చేసిన పాపములను అసహ్యించుకొనుచు సద్వర్తునినిగా జీవించుటకు నిశ్చయించుకొనుట.

"ఏ భేదమును లేదు; అందరును పాపముచేసి దేవుడనుగ్రహించు మహిమను పొందలేకపోవుచున్నారు" (రోమా 3:23). గనుక మానవులందరూ అంతటా మారుమనస్సు పొందవలెనని దేవుడాజ్ఞాపించు చున్నాడు (అ.కా. 17:30). "మీరు మారుమనస్సు పొందని యెడల మీరందరు నశింతురు" అని యేసు ప్రభువు చెప్పుచున్నాడు (లూకా 13:3). "దైవచిత్తాను సారమైన దుఃఖము రక్షణార్థమైన మారుమనస్సును కలుగ జేయును; ఈ మారుమనస్సు పశ్చాత్తాపమును పుట్టించదు. అయితే లోక సంబంధమైన దుఃఖము మరణమును కలుగజేయును" (2 కొరి 7:10). మారుమనస్సు పొందుట వలన ఒకని జీవితములో దిద్దుబాటు కనబడును.

ఉ:-- దైవచిత్తానుసారమైన దుఃఖము

1) పేతురు:-- పేతురు $3^{1/2}$ సం॥ ప్రభువుతో ఉండి, ప్రభుని ప్రేమించి ప్రభువు కొరకు తన ప్రాణమును పెట్టుటకు సిద్ధముగా ఉన్నానని చెప్పగా ఆయన పేతురూ నీవు నన్నెరుగవని ముమ్మారు చెప్పువరకు, నేడు కోడి

కూయదని నీతో చెప్పుచున్నాననెను (లూకా 22:31-34). లూకా 22:54-62 వరకు మనము చదివినట్లుయిన పేతురు ప్రభువుని ఎరుగనని ముమ్మారు బొంకగా వెంటనే కోడి కూసెను. "అప్పుడు ప్రభువు తిరిగి పేతురు వైపు చూచెను గనుక పేతురు నేడు కోడి కూయక మునుపు నీవు ముమ్మారు నన్ను ఎరుగనందువని ప్రభువు తనతో చెప్పిన మాట జ్ఞాపకము చేసుకొని, వెలుపలికి పోయి సంతాపపడి ఏడ్చెను". ఇచ్చట పేతురు దైవచిత్తానుసారమైన దుఃఖము ద్వారా రక్షణర్థమైన మారుమనస్సు పొంది పెంతెకొస్తు పండుగనాడు క్రీస్తు సంఘమును స్థాపించగలిగాడు.

2) యూదా:-- యూదా యేసయ్యను 30 వెండి నాణెములకు అప్పగించి ప్రభువు శిలువ మరణము పొందగా లోకానుసారమైన దుఃఖము దుఃఖించి ఘోర మరణము పొందెను. అపొ.కా. 1:18 "ఈ యూదా ద్రోహము వలన సంపాదించిన రూకల నిచ్చి యొక పొలము కొనెను. అతడు తలక్రిందులుగా పడి నడిమికిబ్రద్దలైనందున అతని ప్రేగులన్నియు బయటకి వచ్చెను".

పాతనిబంధనలో చూచిన యెడల మారుమనస్సును గూర్చి దేవుడు తన ప్రజలను పదేపదే హెచ్చరించియున్నాడు. "ప్రభువైన యెహోవా సెలవిచ్చినదేమనగా, మీ విగ్రహములను విడిచిపెట్టి మీరు చేయు హేయకృత్యములన్నిటిని మాని మనస్సు త్రిప్పుకొనుడి" (యెహెజ్కేలు 14:6). దేవుడు మరల ఈ విధముగా హెచ్చరిస్తున్నాడు: "కాబట్టి ఇశ్రాయేలీయులారా, యెవని ప్రవర్తననుబట్టి వానికి శిక్ష విధింతును. మనస్సు త్రిప్పుకొని మీ అక్రమములు మీకు శిక్షా కారణములు కాకుండునట్లు వాటన్నిటిని విడచిపెట్టుడి. మీరు జరిగించిన అక్రమ క్రియలన్నిటిని విడిచి నూతన హృదయమును, నూతన బుద్ధియు తెచ్చుకొనుడి. ఇశ్రాయేలీయులారా, మీ రెందుకు మరణము నొందుదురు? ఇదే ప్రభువగు యెహోవా వాక్కు ...... మీరు మనస్సు త్రిప్పుకొనుడి, అప్పుడు మీరు బ్రతుకుదురు (యెహె 18:30-32).

క్రొత్తనిబంధనలో :-- మత్తయి 3:2లో "పరలోకరాజ్యము సమీపించి యున్నది, మారుమనస్సు పొందుడి" అని యోహాను భోదించాడు. మత్తయి 3:7లో "మారుమనస్సునకు తగిన ఫలము ఫలించుడి" అని భోధించెను. మారుమనస్సు అనగా పాపము విడిచిపెట్టుట, దేవుని వైపు తిరుగుట. యేసుప్రభువు మారుమనస్సును గూర్చి చక్కటి ఉపమానములు ద్వారా బోధించియున్నాడు. 1) తప్పిపోయిన గొఱ్ఱె (లూకా 15:3-7) 2) పోగుట్టుకొనిన నాణెము (లూకా 15:8-10).

3) తప్పిపోయిన కుమారుడు (లూకా 15:11-24) :-- తప్పిపోయిన కుమారుడు ఎంత పాపి అయినను మారుమనస్సు పొంది తండ్రి దగ్గరకు రాగా తండ్రి అతనిని ప్రేమించి, క్షమించి, తన గృహములో తన బిడ్డగా చేర్చుకున్నాడు.

"కొందరు ఆలశ్యమని యెంచుకొనునట్లు ప్రభువు తన వాగ్దానమును గూర్చి ఆలశ్యము చేయువాడు కాడు గాని ఎవడును, నశింపవలెనని యిచ్ఛయింపక, అందరూ మారుమనస్సు పొందవలెనని కోరుచూ, మీయెడల దీర్ఘశాంతము కలవాడై యున్నాడు (2 పేతురు 3:9).

మానవులు పాపము చేయుటకు 2 కారణాలు ఉన్నవి. 1) అందు తాత్కాలిక సంతోషము ఉన్నది. "అల్పకాలము పాపభోగము అనుభవించుట కంటె దేవుని ప్రజలతో శ్రమ అనుభవించుట మేలని మోషే యెంచినట్లు చెప్పబడెను" (హెబ్రీ 11:26). 2) "దుష్క్రియకు తగిన శిక్ష శీఘ్రముగా కలుగుక పోవుట చూచి మనుష్యులు భయము విడిచి హృదయ పూర్వకముగా దుష్క్రియలు చేయుదురు" (ప్రసంగి 8:11).

మనము మారుమనస్సు పొందకుండా దేవుని ఎందుకు శోధించాలి? మారుమనస్సు పొందకపోయిన మనకేమి కలుగును? మారుమనస్సు పొందని యెడల మీరందరు నశింతురు అని యేసు

చెప్పెను (లూకా 13:3). "అటువలె మారుమనస్సు పొందు ఒక్క పాపి విషయమై దేవుని దూతల ఎదుట సంతోషము కలుగునని" యేసుప్రభువు భోధించారు (లూకా 15:10). "దేవుని అనుగ్రహము మారుమనస్సు పొందుటకు నిన్ను ప్రేరేపించు చున్నదని యెరుగక, ఆయన అనుగ్ర హైశ్వర్యమును, సహనమును, దీర్ఘశాంతమును తృణీకరించెదవా? నీ కాఠిణ్యమును, మార్పుపొందని నీ హృదయమును అనుసరించి ఉగ్రత దిన మందు అనగా దేవుని న్యాయమైన తీర్పు బయలు పరచబడు దినమందు నీకు నీవే ఉగ్రతను సమకూర్చుకొను చున్నావు. ఆయన ప్రతివానికి వానివాని క్రియల చొప్పున ప్రతిఫలమిచ్చును. సత్క్రియను ఓపికగా చేయుచు, మహిమను, ఘనతను, అక్షయతను వెదకు వారికి నిత్యజీవము నిచ్చును. అయితే భేదములు పుట్టించి సత్యమునకు లోబడక దుర్నీతికి లోబడువారి మీదికి దేవుని ఉగ్రతయు రౌద్రమును వచ్చును (రోమా 2:4-8).

"ఆ అజ్ఞానకాలములను దేవుడు చూచిచూడనట్టుగా ఉండెను; ఇప్పుడైతే అంతటను అందరును, మారుమనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు "(అ.కా. 17:30). నీవు ఆయన వాక్యాన్ని అంగీ కరించావా? నీవు వాక్యానికి విధేయుడవు కావలెనని పరిశుద్ధాత్ముడు నిన్ను ఆహ్వానిస్తున్నాడు. "మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు పరిశుద్ధాత్మ అనువరము పొందుదురు" (అపొ.కా. 2:38).

-- జి. షడ్రక్, పాలకొల్లు.

**సత్యవాక్కు పాఠకులకు విజ్ఞప్తి:--** మాకు సత్యవాక్కు పత్రిక ఒక కాపీ కంటె ఎక్కువగా అందుచున్న యెడల వెంటనే మాకు తెలియజేయండి. మీ సత్యవాక్కు నెంబరుకూడ తెలియపర్చండి.

వారందరికీ మంచి ఆతిధ్యము నిచ్చిరి, సత్కరించిరి. అరికిరేవుల క్రీస్తుసంఘము, చిల్డ్రన్‌హోమ్‌లో యున్న బాలురు, బాలికలు ఆసక్తితో దేవుని వాక్యమును వినిరి. కొవ్వూరు, అరికరేవులలో జరుగుచున్న దేవుని పనిని బట్టి సోదరులు విశ్వేశ్వరరావ్‌గారు అభినందనీయులు. మరియు ఆ కూటములో బైబిలు వాక్యపఠనము గావించిన సోదరులు ఆర్.డి. పూర్ణచంద్రరావ్ గారు కూడా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు పొందినందున అభినందనీయులు.

సెప్టెంబరు 18వ తేదీ ఉదయం పిఠాపురం మండలం క్రొత్తకందరాడలో జరిగిన స్థానిక సంఘ సమావేశములో సోదరులు జాషువాగూటం గారు సతీసమేతముగా హాజరై వాక్యోపదేశము గావించిరి. క్రొత్తకందరాడలో సోదరులు యమ్. యేసుదాసు గారు సువార్తికునిగా పనిచేయుచున్నారు.

సెప్టెంబరు 18వ తేదీ రాత్రి పెద్దాపురం మండలం పులిమేరులో జరిగిన కూటములో సోదరులు జాషువాగారు వాక్యపరిచర్య చేసిరి. పులిమేరు సంఘములో యున్న స్త్రీలకు దేవుని వాక్యమును గూర్చిన ఆసక్తి గొప్పది. పులిమేరులో కృపానందం గారు, వారి కుమారుడు ప్రేమ్‌కుమార్ గారు వాక్యపరిచర్య చేయుచున్నారు.

సెప్టెంబరు 22వ తేదీనాడు కాకినాడలో జరిగిన కృతజ్ఞతా కూటములో సోదరులు జాషువాగూటం గారు వాక్యపరిచర్య చేసిరి. రాజమండ్రిలో యున్న బి.ఇడి కాలేజి ప్రిన్సిపాల్‌గారు తన జన్మదినసందర్భముగా ఆ కూటమును ఏర్పాటుచేసిరి. ఆ కూటమునకు పట్టణప్రముఖులు, అనేక హైస్కూళ్ల హెడ్‌మాస్టర్లు హాజరై ప్రిన్సిపాల్ సి.ఎ.వి. ప్రసాద్ గారిని అభినందించిరి.

**"సత్యవాణి"** అను మా రేడియో కార్యక్రమమును ప్రతి ఆది, సోమ, మంగళ, గురు వారాల్లో మధ్యాహ్నం 2-00 గం॥లకు రేడియో శ్రీలంక ద్వారా వినండి!

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న **"సత్యవాణి"** టి.వి. కార్యక్రమమును **S.S. Music** ఛానల్‌లో ప్రతి ఆదివారం ఉదయం 7-00 గం॥ నుండి 7-30 వరకు టి.వి. ద్వారా సువార్త వినండి!

❀ ❀ ❀ ❀ ❀

RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/02/2002

From:
**SATYA VAKKU
P.O. BOX 80,
KAKINADA - 533 001**

To

Edited & Published by Joshua Gootam & Published at SATYA VANI, Church of Christ & Printed by him at Satya Vani Publications, Sambhamurthy St. Kakinada -533 004.